మాజీ మంత్రి హరీశ్ రావుకు పితృవియోగం




# PCW
తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

మావోయిస్టు అగ్రనేత బండి సరెండర్




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 305 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 29 అక్టోబర్ 2025


## శృంగేరీ పీఠాధిపతిని కలుసుకున్న సిఎం రేవంత్

**వేములవాడ ఆలయ విస్తరణపై చర్చలు**

**హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్ పర్యటనలో ఉన్న శృంగేరీ పీఠం ఆచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామిని సిఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్÷-తో కలసి శంకరమఠంలో వేంచేసి వున్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనతో వేములవాడ ఆలయ పునరుద్దరణ పనులపై చర్చించారు. సంప్రదాయ దుస్తుల్లో వెళ్లి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే సిఎంకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు.



## ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి..

### నామినేట్ చేయనున్న జపాన్!

**టోక్యోలో ప్రధాని సనే టకైచీతో ట్రంప్ భేటీ సందర్భంగా ప్రకటన**

**థాయ్‌లాండ్-కంబోడియా, గాజా శాంతి ఒప్పందాల ఘనత ట్రంప్‌దేనన్న జపాన్ ప్రధాని**

**ఇప్పటికే ట్రంప్‌ను నామినేట్ చేసిన ఇజ్రాయెల్, పాకిస్థాన్, కంబోడియా వంటి దేశాలు**

**కీలక ఖనిజాలపై అమెరికా, జపాన్ మధ్య ఒప్పందం**



ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను నామినేట్ చేసే దేశాల జాబితాలో జపాన్ కూడా చేరనుంది. ప్రస్తుతం ఆసియా పర్యటనలో ఉన్న ట్రంప్‌కు మద్దతు తెలుపుతున్నట్లు జపాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు వైట్‌హౌస్ ఒక ప్రకటన విడుదల చేసింది**మిగతాది** 2లో...

## కాకినాడ వద్ద తీరం దాటిన మొంథా తుఫాన్

**గంటకు 9నుంచి 110 కిమీ వేగంతో గాలులు**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**అమరావతి వాతావరణ శాఖ వెల్లడి**



**అమరావతి,28(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు సమీపంలో మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని అమరావతి ఐఎండీ ప్రకటించింది. పూర్తిగా తీరాన్ని దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటలు సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. కాకినాడ-మచిలీపట్నం మధ్య మొంథా తుపాన్ తీరాన్ని తాకిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో గంటకు 17 కి.మీ వేగంతో తుపాన్ కదిలిందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి మచిలీపట్నానికి 120 కిమీ, కాకినాడకి 110 కిమీ, విశాఖపట్నానికి 220 కిమీ దూరంలో కేంద్రీకృతమైందని తెలిపారు.**మిగతాది** 2లో...



# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ



**టిక్కెట్ల రేట్లలో కార్మిక సంక్షేమం కోసం 20శాతం**

**ఆరోగ్యశ్రీ, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ప్రత్యేక స్కూలు**

**సినీకార్మిక సంఘం సన్మాన సభలో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. యూసుఫ్‌గూడలో నిర్వహించిన సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ కార్మికుల సంక్షేమంపై సీఎం పలు కీలక హామీలు ఇచ్చారు. కృష్ణా నగర్‌లో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో కార్మికుల పిల్లల కోసం **మిగతాది** 2లో...

## తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు నీటి తరలింపు




**80టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలు చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష**

## సొంత జిల్లాకు రేవంత్ అన్యాయం

**పాలమూరు-రంగారెడ్డి పై నిర్లక్ష్యం**

**జిల్లా ప్రజలు రేంవత్‌ను క్షమించరు**

**ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు**

**జాగృతి జనంబాటలో కవిత డిమాండ్**



హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :సొంత జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన రిజర్వాయర్‌ను సందర్శించి కవిత మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చారిత్రక అన్యాయం చేస్తున్నారని.. జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని క్షమించరని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లను సుప్రీంకోర్టు సస్పెన్షన్‌లో పెట్టినా.. రివ్యూ పిటిషన్ వేయకపోవటం దారుణమని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ ప్రాజెక్ట్‌ల పర్మిషన్ ఆపేసి లిస్ట్ లోంచి తీసేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవటం లేదన్నారు.**మిగతాది** 2లో...

# మాజీ మంత్రి హరీశ్ రావుకు పితృవియోగం



- **హరీశ్ రావు తండ్రి సత్యనారాయణ రావు కన్నుమూత**
- **వయోభారంతో హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస**
- **హరీశ్ రావు కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి**
- **దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన**
- **పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖుల సంతాపం**
- **తన బావ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించిన బీఆర్ఎస్ అధినేత**



హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్ రావు ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తండ్రి సత్యనారాయణ రావు (95) మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలియగానే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా సంతాప సందేశాన్ని విడుదల చేసింది. "మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు టీ హరీశ్ రావు గారి తండ్రి సత్యనారాయణ రావు గారి మరణం పట్ల ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు తీవ్ర సంతాపం తెలిపారు.**మిగతాది** 2లో...

# చకచకా మూసీ రివర్‌ఫ్రంట్

## వేగంగా కదులుతున్న పనులు

- **మూసీ అభివృద్ధిలో కీలక ముందడుగు**
- **కార్పొరేషన్‌కు 734 ఎకరాల భూమి బదలాయింపు**
- **భూములను కేటాయిస్తూ సీసీఎల్ఏ ఉత్తర్వులు**
- **ప్రాజెక్టు కోసం ఏడీబీ నుంచి రూ. 4,100 కోట్ల రుణం**
- **కేంద్ర ప్రభుత్వం నుంచి సూత్రప్రాయ అంగీకారం**
- **నవంబర్‌లో డీపీఆర్ సిద్ధం చేయనున్న ప్రభుత్వం**



హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :
తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ నది సుందరీకరణ, అభివృద్ధి ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు 734.07 ఎకరాల భూమిని **మిగతా** 2లో...

## మావోయిస్టు అగ్రనేత బండి సరెండర్

**తెలంగాణ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన బండి ప్రకాశ్**

**45 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో క్రియాశీలకం**

**మంచిర్యాల జిల్లా మందమర్రిలో జన్మించిన ప్రకాశ్**




## 8వ వేతన సంఘం విధివిధానాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల పెంపుపై సిఫార్సులు**

**నియామకం జరిగిన 18 నెలల్లోగా కమిషన్ నివేదిక సమర్పణ**

**సుమారు 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం**

**2026 జనవరి 1 నుంచి సిఫార్సులు అమల్లోకి వచ్చే అవకాశం**



# మాజీ మంత్రి హరీశ్ రావుకు పితృవియోగం

(మొదటి పేజీ తరువాయి)

వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. హరీశ్ రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సత్యనారాయణ రావు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. ఆయన మరణవార్త తెలియగానే బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావుతో పాటు పలువురు పార్టీ నేతలు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు, కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటిస్తున్నారు. హరీశ్ రావు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు పలువురు నేతలు సిద్ధమవుతున్నారు. సత్యనారాయణ రావు అంత్యక్రియలు సాయంత్రం హైదరాబాద్ ఫిల్మ్ నగర్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు ఈ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన భౌతికకాయానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు.





కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉన్న సత్యనారాయణ రావు పార్థివ దేహానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. అనంతరం హరీశ్ రావును, ఆయన తల్లి, తన ఏడో సోదరి అయిన లక్ష్మిని కేసీఆర్ పరామర్శించారు. సత్యనారాయణ రావు, కేసీఆర్‌కు స్వయానా బావ అవుతారు. ఈ సందర్భంగా తన బావతో ఉన్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సత్యనారాయణ రావు మృతి వార్త తెలిసిన వెంటనే కేసీఆర్ ఫోన్‌లో హరీశ్ రావుతో మాట్లాడి ధైర్యం చెప్పిన విషయం తెలిసిందే. అదే విధంగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా సత్యనారాయణ రావు భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా సత్యనారాయణ రావుకు నివాళులర్పించి, హరీశ్ రావు కుటుంబాన్ని పరామర్శించారు.

# మావోయిస్టు అగ్రనేత బండి సరెండర్

## తెలంగాణ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన బండి ప్రకాశ్

**హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
మావోయిస్టు పార్టీకి తెలంగాణలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నేత బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిశారు. దాదాపు 45 సంవత్సరాలుగా సీపీఐ (మావోయిస్టు) పార్టీలో బండి ప్రకాశ్ క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, నేషనల్ పార్క్ ఏరియాకు కీలక ఆర్గనైజర్‌గా ఆయన పలు ముఖ్య బాధ్యతలు నిర్వర్తించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి ఆయన స్వస్థలం. 1982-84 మధ్యకాలంలో జరిగిన 'గో టు ద విలేజెస్' ఉద్యమంలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) తరఫున ఆయన పనిచేశారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీ అనుబంధ సంస్థ అయిన సింగరేణి కార్మిక సంఘానికి అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. ఇటీవల కాలంలో పలువురు కీలక మావోయిస్టు నేతలు లొంగిపోతున్న నేపథ్యంలో, దాదాపు నాలుగున్నర దశాబ్దాల అనుభవం ఉన్న బండి ప్రకాశ్ వంటి సీనియర్ నేత లొంగిపోవడం పార్టీకి కోలుకోలేని దెబ్బ అని పోలీసు వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి..

(మొదటి పేజీ తరువాయి).

సోమవారం జపాన్ పర్యటనకు వచ్చిన డొనాల్డ్ ట్రంప్, ఆ దేశ నూతన ప్రధాని సనే టకైచీతో సమావేశమయ్యారు. టోక్యోలోని అకసకా ప్యాలెస్‌లో జరిగిన ఈ భేటీ సందర్భంగా, నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ నామినేషన్‌కు తాము మద్దతిస్తామని టకైచీ స్పష్టం చేసినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. అయితే, దీనిపై జపాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.
ఈ సమావేశంలో అంతర్జాతీయ శాంతి స్థాపన కోసం ట్రంప్ చేస్తున్న కృషిని టకైచీ కొనియాడారు. ముఖ్యంగా థాయ్‌లాండ్-కంబోడియా మధ్య శాంతి ఒప్పందం, గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించారని ఆమె ప్రశంసించారు. "అధ్యక్షా, మీరు థాయ్‌లాండ్, కంబోడియా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించడంలో విజయం సాధించారు. అలాగే, మధ్యప్రాచ్యంలో మీరు ఇటీవల కుదిర్చిన ఒప్పందం అపూర్వమైనది, చారిత్రాత్మకమైనది" అని టకైచీ అన్నారు. ఆసియాలో అమెరికాకు జపాన్ అత్యంత విశ్వసనీయ మిత్రదేశంగా ఉంది. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ మూలకాలపై ఒక ముఖ్యమైన ఒప్పందం కూడా జరిగింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ట్రంప్ తనను తాను 'శాంతి అధ్యక్షుడు'గా అభివర్ణించుకుంటున్నారు. గాజా యుద్ధం, భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతలు, థాయ్‌లాండ్-కంబోడియా వివాదం సహా మొత్తం ఎనిమిది యుద్ధాలకు ముగింపు పలికినట్లు ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి ఆయనకు దక్కనప్పటికీ, ఇజ్రాయెల్, పాకిస్థాన్, కంబోడియా, థాయ్‌లాండ్ వంటి అనేక దేశాలు ఇప్పటికే ఆయన అభ్యర్థిత్వానికి బహిరంగంగా మద్దతు తెలిపి, అధికారికంగా నామినేట్ చేశాయి. ఆసియా పర్యటనలో భాగంగా ట్రంప్ మొదట మలేషియాలో పర్యటించి ఆసియాన్ సదస్సులో పాల్గొన్నారు. అనంతరం జపాన్‌కు చేరుకున్నారు. బుధవారం ఇక్కడి నుంచి దక్షిణ కొరియాకు బయలుదేరనున్నారు. అక్కడ ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఎపెక్) సదస్సులో పాల్గొంటారు. వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కూడా ట్రంప్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు.

# చకచకా మూసీ రివర్‌ఫ్రంట్

(మొదటి పేజీ తరువాయి)

బదలాయిస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) లోకేశ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు (జీవో 138) జారీ చేశారు. దీంతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం కానున్నాయి. గతంలో పలు ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన భూములను ఇప్పుడు మూసీ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఈసా నది సమీపంలోని గండిపేట మండలం పరిధిలోని హిమాయత్ సాగర్, కిసమత్‌పూర్‌తో పాటు రాజేంద్రనగర్ మండలంలోని ప్రేమావతిపేట్, బుద్వేల్ ప్రాంతాల్లో ఈ భూములు ఉన్నాయి. టీఈఈఆర్ఎల్, ఐఐపీహెచ్, వాలంతరి వంటి సంస్థలకు కేటాయించిన భూములతో పాటు, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో హెచ్ఎండీఏ లేఅవుట్ కోసం కేటాయించిన భూమిని కూడా మూసీ ప్రాజెక్టు కోసం బదలాయించారు. అయితే, ఈ భూములు ఏపీ పునర్విభజన చట్టంలోని 10వ షెడ్యూల్ పరిధిలో ఉన్నందున, ఏవైనా న్యాయపరమైన వివాదాలు, ఇతర నిబంధనలకు లోబడి తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. భూములను కోల్పోయిన సంస్థలకు ప్రత్యామ్నాయంగా ఫ్యూచర్ సిటీలో స్థలాలను కేటాయించనున్నట్లు తెలిపింది.
భూ కేటాయింపు ప్రక్రియ ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణలో కూడా పురోగతి సాధించారు. మూసీ అభివృద్ధి కోసం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రూ. 4,100 కోట్ల రుణం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. గతంలో ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని భావించినా, తాజాగా ఏడీబీ నుంచి నిధులు స్వీకరించేందుకు పురపాలక శాఖ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా ఏడీబీ ప్రతినిధులతో అధికారులు సమావేశమై చర్చలు జరపగా, రుణం మంజూరుకు ఏడీబీ సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనపై అధికారులు దృష్టి సారించారు. నవంబర్ నాటికి డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# 8వ వేతన సంఘం విధివిధానాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇది శుభవార్త. లక్షలాది మంది ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం (8%ష్ట జవత్‌తీఖ్రీ ్ఖఎ జశీఎఎఱంంఱశీఅ%) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర కేబినెట్.. 8వ వేతన సంఘం ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలకు (%ువతీఎం శీట =వటవతీవఅవవ%) ఆమోదముద్ర వేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షనర్ల చెల్లింపుల పెంపుపై ఈ కమిషన్ త్వరలో తన పనిని ప్రారంభించనుంది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మందికి పైగా పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. వేతన సంఘం ఒక తాత్కాలిక వ్యవస్థలా పనిచేస్తుంది. ఇందులో ఒక ఛైర్‌పర్సన్, ఒక పార్ట్‌టైమ్ సభ్యుడు, ఒక మెంబర్-సెక్రటరీ ఉంటారు. ఈ కమిషన్ తన నియామకం జరిగిన తేదీ నుంచి 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన సిఫార్సులను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే, తుది సిఫార్సులకు ముందే మధ్యంతర నివేదికలు కూడా ఇచ్చే వెసులుబాటును కల్పించారు. సిఫార్సులు చేసేటప్పుడు కమిషన్ పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ నిర్దేశించింది. దేశ ఆర్థిక పరిస్థితి, ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల లభ్యత వంటి అంశాలను పరిశీలించనుంది. అలాగే, ఈ సిఫార్సుల ప్రభావం రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందో కూడా అంచనా వేయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (%ూూఖ%), ప్రైవేట్ రంగంలోని ఉద్యోగుల జీతభత్యాలు, పని పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని నివేదిక రూపొందించాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. ఉద్యోగుల జీతభత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఇతర సేవా నిబంధనలను సమీక్షించి, వాటిలో మార్పులను సూచించడం ఈ కమిషన్ ప్రధాన విధి. ఈ క్రమంలో, 8వ వేతన సంఘం సిఫార్సులు 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. 7వ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయగా, దాని సిఫార్సులను ప్రభుత్వం 2016 జనవరి నుంచి అమలు చేసిన విషయం తెలిసిందే. 8వ వేతన సంఘం ఏర్పాటుపై ప్రభుత్వం 2025 జనవరిలో ప్రకటన చేసింది. తాజాగా కేబినెట్ ఆమోదంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందుకు సాగనుంది.

# తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు నీటి తరలింపు

## 80టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలు

## చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

**హైదరాబాద్,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేం దుకు.. ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై మంగళవారం జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

# సొంత జిల్లాకు రేవంత్ అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చిన కవిత ప్రజలతో మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లాకు నీరిచ్చే వరప్రదాయని కృష్ణానది అని కొనియాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత అలాంటి కృష్ణానదిపై పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డిజైన్ చేసుకోవటం జరిగిందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా సరే ప్రాజెక్ట్ ఒక్క అడుగూ ముందుకుపడలేదని విమర్శించారు. ఉదండాపూర్, కరివెనలో ఒక్క తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్లపూర్- ఏదుల టన్నెల్ పనులను చేయటం లేదన్నారు. ఒక పక్క ఉన్న నీళ్లను వాడుకోవటం లేదని.. మరో పక్క ఆల్మట్టి ఎత్తు పెంచితే మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. తక్షణమే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలనికవిత డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసిత రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. భూ నిర్వాసితులకు ఏ రోజు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందో ఆనాటి రేటు కట్టి ఇవ్వాలని చెప్పారు. 2021 నాటికే కటాఫ్ పెట్టటం సరికాదని.. పరిహారం ఇచ్చే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఇవ్వాల్సిందేనని అన్నారు. తప్పు బీఆర్ఎస్ చేసిందా? కాంగ్రెస్ చేసిందా? అని కాదని.. ఇక్కడ ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి జరగాలని మాత్రమే తాను ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగతా పనులు ఈ ప్రభుత్వం చేస్తుందా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. జనంబాటలో భాగంగా పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులతో మాట్లాడారు. తెలంగాణ రాకముందు మహబూబ్ నగర్ లో నీళ్ల కరువు ఎలా ఉండేదో అందరికీ తెలుసని చెప్పారు. వందల ఎకరాలు ఉన్న వారు కూడా నీళ్లు లేక వలస పోయారని ఆనాటి రోజులను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారానీటి సమస్యలను అధిగమించామని చెప్పారు. కృష్ణా నది నీళ్లను వినియోగి ంచుకోవాలని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ చేపట్టారని తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్ సహా అన్ని పనులు 80 శాతం వరకు అప్పుడే పూర్తయ్యాయని అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. రేవంత్ రెడ్డి గెలిచి కూడా రెండేళ్లు అయ్యిందని చెప్పారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ కోసం భూములు ఇవ్వటానికి ఇక్కడి ప్రజలు పెద్ద మనసు చేసుకొని ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్ కూడా అందిస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు ఉచిత వైద్యం కూడా అందిస్తాం అని చెప్పారు. తన మాటకు కట్టుబడి కృష్ణానగర్‌కు వచ్చానని గుర్తుచేసిన రేవంత్.. కార్మికుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేస్తాం. వెల్ఫేర్ ఫండ్‌కు 10 కోట్లు ఇస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్మికుల కోసం ఆ నిధులు వినియోగించండని అన్నారు. అంతేకాకుండా, సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు. నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫైటర్స్, టెక్నీషియన్ల నైపుణ్యం పెంచేందుకు ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు , పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ వద్ద తీరం దాటిన మొంథా తుఫాన్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా తీరం దాటడానికి 3-4 గంటల సమయం పడుతోందన్నారు. దీని ప్రభావంతో కోస్తా వెంబడి గంటకు 90-100 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వివరించారు. ప్రజలు సురక్షితంగా ఇంట్లోనే ఉండాలన్నారు. కృష్ణా జిల్లాలోని గుడివాడలో తుఫాను ప్రభావంతో భారీ గాలులతో పలుచోట్ల ప్రధాన రహదారుల్లో చెట్లు నేలకూలాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్, గుడివాడ ముదినేపల్లి ప్రధాన రహదారిలో వృక్షాలు నేల కూలాయి. గుడివాడ - విజయవాడ ప్రధాన రహదారిలో వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రోడ్డుకి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. హుటాహుటిన విపత్తు స్పందన / అగ్నిమాపక శాఖ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. చిమ్మ చీకటిలో ఆధునిక యంత్ర సామాగ్రితో రోడ్లపై కూలిన చెట్లను బృందాలు తొలగిస్తున్నాయి. ముదినేపల్లి ప్రధాన రహదారిలో కూలిన వృక్షాలను గుడివాడ రూరల్ పోలీసులు తొలగించారు. ప్రకాశం జిల్లాలో తుపాను ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు పడుతున్నాయి. ఈదురు గాలులతో ఒంగోలుతో పాటు తీర ప్రాంత గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద రామన్న చెరువుకి గండి పడింది. ఒంగోలు - చీరాల రహదారిపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు క్లియర్ చేస్తున్నారు. వర్షాల ధాటికి సంతనూతలపాడు చెరువు నిండి అలుగు పారుతుంది. ఒంగోలు - చీమకుర్తి రహదారిపై వరద నీరు భారీగా ప్రవహిస్తోంది. ముందస్తు చర్యల్లో భాగంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చెట్లు పడి, విద్యుత్ తీగలు తెగి, స్తంభాలు కూలిన ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పరిస్థితిని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నిపిపివేసిన ప్రాంతాల్లో త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరించేలా మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సమస్య తలెత్తిన ప్రాంతాల్లో సిబ్బంది వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

# “మిషన్ భగీరథలో నీళ్లు వచ్చాయి.. కానీ యువత కళ్లల్లో మాత్రం కమ్మేసింది నిరాశ!”

**వాజేడు, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** “నాలుగేళ్లలో రెండు లక్షల ఉద్యోగాలు!” “జాబ్ క్యాలెండర్ వస్తుంది!”“ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం!”ఇలా ప్రతి ఎన్నికల ముందు ఇచ్చే హామీలు, ఎన్నికలు ముగిసిన వెంటనే పాత ఫైళ్లలో దూళి తినేస్తున్నాయి.కానీ వాటి మధ్యలో ఆకలితో, ఆశలతో, ఆగ్రహంతో కాలం గడిపేది ఎవరు? గ్రామ యువత.తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ నిరుద్యోగం 2025 నాటికి 22% దాటిందని పలు సంస్థలు చెబుతున్నాయి.ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ క్యాలెండర్ అంటూ ప్రకటనలు ఇస్తుంటే, మరోవైపు జిల్లా ఉద్యోగ మార్పిడి కార్యాలయాలు నెలకు 2-3 అవకాశాలు మాత్రమే చూపుతున్నాయి.ఆ పరిస్థితిలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంఎబిఏ చదివిన యువత కూడా రోజూ కూలి, దినసరి, ఫుడ్ డెలివరీ పనులు చేస్తున్నారు.చదువుకున్న ప్రతి యువకుడు తల్లిదండ్రుల ఆశగా ఉన్నాడు.కానీ ఆ యువకుడు ప్రభుత్వ దరఖాస్తులకోసం 500 రూపాయల ఫీజు, సర్టిఫికేట్ వేరిఫికేషన్, ఎగ్జామ్ ఫీజు, టెన్షన్ %-% ఇవన్నీ ఎదుర్కొని చివరికి “ఫలితాలు వాయిదా” అనే వార్తే చూసే రోజులు వచ్చాయి.గ్రామాల్లో చర్చే ఇదే **“పట్టణం వెళ్తే ఏదో దొరుకుతుంది, ఇక్కడ ఏం లేదు!”** ఇలా ఒక్కొక్క యువకుడు వదిలి వెళ్ళడంతో గ్రామాల్లో పని చేతులు తగ్గిపోయాయి, పంట పొలాలు ఖాళీ అయ్యాయి, పాఠశాలలు మూతపడ్డాయి.హామీ మాటలు – ఖాళీ కాగితాలే! **ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు:** 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ స్థానిక పరిశ్రమలకు సబ్సిడీలు యువతకు ట్రైనింగ్ సెంటర్లు ఏది అమలు అయ్యింది?ఏదీ పూర్తిగా కాదు!ఒక్కో యువకుడు రోజుకు 10 సార్లు వెబ్సైట్‌లో రిజల్ట్ చెక్ చేస్తూ, చివరికి “తాత్కాలిక వాయిదా” అని చదువుతుంటాడు.**గ్రామ యువత బాధలు :** “మా తండ్రి కష్టపడి నాకు చదివించాడు.. **ఇప్పుడు నేను పని కోసం కష్టపడుతున్నా!”**అలా ప్రతి ఇంటిలో ఒక నిరుద్యోగుడి బాధ – ఒక తల్లిదండ్రి నిశ్శబ్దం.చాలామంది విదేశాలకు వెళ్ళిపోవాలని చూస్తున్నారు.కొంతమంది మోటార్ బైక్‌లో జోమాటో, స్విగ్గి డెలివరీ చేస్తూ గడుపుతున్నారు.ఉద్యోగం అనే ఆశ కలిగిన యువత ఇప్పుడు జీవనోపాధి కోసం యుద్ధం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి – నిరుద్యోగం బంధనం: ఉద్యోగాలు లేవు కాబట్టి గ్రామాలు ఎదగడం లేదు.గ్రామాల్లో ఉన్న నైపుణ్యం ఉన్న యువత ౨ మట్టి పనులు, హస్తకళలు, పశుపోషణ వంటి రంగాలవైపు తిరిగితే చాలు,అక్కడే అవకాశాలు సృష్టించుకోవచ్చు.కానీ ప్రభుత్వం దానికి మద్దతు ఇవ్వడం లేదు.“యువతను కౌశల్యంతో పెంచాలి, కానీ వాగ్దానాలతో కాదు” అనే పాఠం నేర్చుకోవాల్సిన సమయం ఇది.**యువత మాట:** “మాకు హామీలు కాదు, అవకాశాలు కావాలి!”“నోట్లలో చెప్పే మాటలతో కాదు, ఫలితాల్లో చూపించండి!”**పరిష్కారం:** గ్రామీణ పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం జాబ్ క్యాలెండర్‌ను కచ్చితంగా అమలు చేయాలిస్కిల్ ట్రైనింగ్ సెంటర్లను ప్రతి మండల స్థాయికి తీసుకురావాలిప్రైవేట్ రంగ నియామకాల్లో స్థానికులకు ప్రాధాన్యతయువతకు స్టార్టప్ లోన్లు సులభతరం చేయాలినిరుద్యోగం అనేది కేవలం వ్యక్తిగత బాధ కాదు గ్రామ అభివృద్ధి అడ్డంకి కూడా.ప్రభుత్వాలు మాటల కంటే చర్యలు చూపాలి.లేకపోతే ప్రతి యువకుడు ఒక రోజు అడుగుతాడు“మాకు హామీలు ఎందుకు? ఉద్యోగం ఎందుకు కాదు?”



**– వార్త రచయిత జనగాం ప్రసాద్ రావు (పూసూరు)ఫోన్: 76720 82695**

# 25వ సారి రక్తదానంతో మానవత్వం చాటిన మునుకుంట్ల నాగరాజు!





**పరకాల, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం రోజున పరకాల లోని డిపిఆర్ గార్డెన్లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రజక సంఘాల సమితి హనుమకొండ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మునుకుంట్ల నాగరాజు హాజరై, తన 25వ సారి రక్తదానం చేసి మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ “మన రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని నిలబెడుతుంది. ఆపదలో ఉన్న కుటుంబానికి మన వంతు సహాయం చేసిన వారం అవుతాం” అని అన్నారు. యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం పోలీసులు చేసే సేవ మరువలేనిదని, శాంతి భద్రతల కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకోవడం అవసరమని తెలిపారు.

# నవంబర్ 1న దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ విజయవంతం చేయాలి

- సంగంరెడ్డి పృధ్విరాజ్ యాదవ్ తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షులు



**నర్సంపేట అక్టోబర్ 28,(పీసీడబ్ల్యూ న్యూస్):** కాకతీయ యూనివర్సిటీ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయి పై దాడికి పాల్పడిన మతోన్మాద న్యాయవాదిని అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు ,స్వతంత్ర భారతదేశంలో సీజేఐ పైన జరిగిన దాడిని దేశంలోని దళితుల మీద దాడిగానే భావిస్తున్నాము దళితులు అత్యున్నత స్థానంలో ఉంటే ఓర్వలేని శక్తులుదేశంలో ఎక్కువవుతున్నాయి వాటిని ఖండించడానికి ఇక పైన ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, న్యాయమూర్తి పై దాడి చేయడాన్ని నిరసిస్తూ నవంబర్ 1న ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగబోయే దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ విజయవంతనికై విద్యార్థులు కదిలి రావాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు (జిల్లా ఇంచార్జి) తోకల చిరంజీవి మాదిగ ఎం ఎస్ ఎఫ్ సీనియర్ నాయకులు మంద భాస్కర్ మాదిగ వడ్డేపల్లి మధు మాదిగఎం ఎస్ ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు చింతం సిద్దు మాదిగ రీసెర్చ్ స్కాలర్స్ సుమన్ మాదిగ మాదాసి రమేష్ మాదిగకేయూ అధికార ప్రతినిధి రాణా ప్రతాప్ మాదిగ,తిలక్ మాదిగ, వేణుమాదిగ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ముంగు జిల్లా లింగాపూర్ గ్రామంలో “ఊరు పేరు లేని బడి”

- టీచర్లు, విద్యార్థుల ఇబ్బందులు తీవ్రం







**ములుగు జిల్లా,అక్టోబర్ 28,(పీసీడబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారం మండలం, లింగాపూర్ గ్రామం:స్థానిక ట్రైబల్ జడ్‌పీహెచ్ఎస్ పాఠశాలలో మరుగుదొడ్ల (బాత్రూమ్) సౌకర్యాల లేమి కారణంగా టీచర్లు మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను ఆపి, కొంత భాగం మాత్రమే పూర్తి చేసి వదిలేశారని గ్రామస్థులు తెలిపారు.దీని కారణంగా పాఠశాల పరిశుభ్రత దెబ్బతింది. ముఖ్యంగా మహిళా టీచర్లు మరియు బాలిక విద్యార్థులు తీవ్రమైన అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు.గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ “మన ఊరి పిల్లల భవిష్యత్తు ఉన్న బడికి కనీస సౌకర్యాలు కూడా లేవు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని బాత్రూమ్ పనులు పూర్తి చేయాలి” అని విజ్ఞప్తి చేశారు.



# ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- పరకాల మహిళా డైరీ ఏర్పాటు సంకల్పం : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి





**పరకాల, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ భవాని నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల మహిళా పాల ఉత్పత్తిదారుల సొసైటీ (డైరీ) సభ్యుల సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో మహిళా సొసైటీల ద్వారా సేవలు అందించి, మహిళల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.పరకాల మహిళా డైరీ ప్రారంభానికి ముందు పూర్తి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. చట్టపరమైన మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డైరీ ఏర్పాటు చేస్తేనే ప్రభుత్వం నుండి నిధులు, సబ్సిడీలు లభిస్తాయని వివరించారు. సొసైటీ సభ్యులు తమ సభ్యత్వం, వాటాదారం, మూలధనం పెంచుకోవాలని సూచించారు. “ప్రస్తుతం మన సొసైటీకి దామర మండలం కేంద్రంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాం. మొదటగా పరకాల, నడికూడ మండల కేంద్రాల్లో పాల సేకరణ కార్యక్రమాలు ప్రారంభిస్తాం. సొసైటీ సభ్యులు మరియు సిబ్బందికి గేదెల పెంపకం, పాల సేకరణ, పశుగ్రాసం, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాలు అందిస్తాం” అని తెలిపారు.అంతేకాక, మెజారిటీ కుటుంబాలు సొసైటీలో భాగస్వాములై, ఎక్కువ మహిళలను చేర్పించాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ డీ.ఆర్.డి.ఓ శ్రీనివాస్, మెప్మా అధికారులు, డీ.సీ.ఓ అధికారులు, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి కొరకు రోడ్డుపై రాస్తారోకో...







**వాజేడు,అక్టోబర్ 28,(పీసీడబ్ల్యూ న్యూస్):** త్రాగునీటి కోసం రోడ్డుపై కాలిబిందాలతో నాగారం గ్రామపంచాయతిలో మహిళలు రాస్తారోకో నిర్వహించారు.నాగారం గ్రామ పంచాయతిలో 20 రోజులుగా మంచినీళ్లు రాకపోవడంతో ఆగ్రహించిన జనం కాలి బిందెలతో రోడ్డెక్కారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు.రాస్తారోకో విషయం తెలుసుకున్న మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్ నాయుడు రావడంతో మహిళలు మాట్లాడుతూ గత 20 రోజులుగా త్రాగునీళ్లు రాకపోవడంతో అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామని,తాగడానికి కూడా నీళ్లు లేని పరిస్థితి ఎదురైందని, అధికారులకు చెప్పినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేక పోవడంతో రాస్తారోకో నిర్వహించడం జరిగిందని సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మండిపడ్డారు.ఎంపీఓ మహిళలను సమదాయించే ప్రయత్నం చేయగా ఇన్ని రోజులుగా నీళ్లు రాకుండా అనేక ఇబ్బందులు పడుతూ ఉంటే అధికారులు నిమ్మకు నీరు ఎత్తనట్టుగా ఉండటం మంచి పద్ధతి కాదని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.మరమ్మత్తులను వెంటనే చేయించి 24 గంటలు దాటకుండా నీళ్లు ఇచ్చే లాగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించడం జరిగింది.ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు స్పందిస్తూ తక్షణమే చర్యలు తీసుకుంటామని ప్రజలకు ఇబ్బంది కలగకుండా నీళ్లు వచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ ముడిగతిరుపతి యాదవ్,సిరుమర్తి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కల్లూరు సతీష్,వెంకట్ రెడ్డి,మీనయ్య ,సాయి,ఎట్టి పాపారావు, మహిళలు జంపాల దేవి,తంగిళ్ళపల్లి ,రమాదేవి శారద ,అనసూర్య, వెంకట నర్సు ఇంకా అనేకమంది మహిళలు పాల్గొన్నారు.

# పరకాల పట్టణంలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- ఎస్ఐ రమేష్



**పరకాల,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణ భూపాలపల్లి రోడ్డులో పోలీసులు భారీ స్థాయిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు పరకాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో సాగాయి.ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసై ప్రమాదకర మార్గంలో నడుస్తున్నారు. వీటి వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ వహించి, వీరిని సకాలంలో క్రమపద్ధతిలో నడిపించాలి. పిల్లలు మమ్మల్ని సాదుత అని అనుకుంటే, వారు ప్రమాదాలకు గురవుతున్నారు” అని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే ఆయన హెచ్చరిస్తూ ప్రజల ప్రాణ భద్రతే మా ప్రధాన లక్ష్యం. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎవ్వరినీ వదిలిపెట్టము” అని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ సిబ్బంది పాల్గొనీ వాహనాలను తనిఖీ చేశారు. ప్రజలలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

## నర్సరిని పరిశీలించిన ఎంపీడీవో అద్వైత





**ఖానాపురం,అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** ఖానాపూర్ మండలంలోని రాగం పేట గ్రామ పంచాయతీని సందర్శించి ఎంపీడీవో అద్వైత నర్సరీ మరియు పల్లె ప్రగతి వనాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్నది వేసవికాలం కావున మొక్కలకు తగిన నీటిని అందించాలని సంబంధించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి కి మరియు సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సునీల్ రాజ్, మరియు కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడిని పరామర్శించిన మాజీ ఎంపీపీ తక్కళ్ళపెల్లి రవీందర్ రావు



**ఖానాపూరం, అక్టోబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపురం మండల బుధరావుపేటకు చెందిన రేషన్ డీలర్ ఎలమిశెట్టి ప్రసాద్ ఇటివల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి గాయాల పాలయ్యాడు. చికిత్స పొంది ఇంటికి వచ్చిన ప్రసాద్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాజీ ఎంపీపీ తక్కళ్ళపెల్లి రవీందర్ రావు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల కాంగ్రెస్ నాయకులు పొడుపుగంటి మధు,పరిటాల నాగేశ్వర్ రావు,పల్సా ప్రశాంత్,యాకుబ్,బండి ప్రభాకర్,పరిటాల రామారావు,రాగం వెంకన్న,గట్ల సుదర్శన్, సైప సురేష్ ,మోకుదెబ్బ జిల్లా కార్యదర్శి మల్లేష్ గౌడ్,లంబాడ జేఏసీ మండల కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ హెడ్మాస్టర్‌కు నివాళు లర్పించిన బిఆర్ఎస్ నాయకులు





**ఖానాపూర్, అక్టోబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపూర్ మండలంలోని బుదరావుపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ నల్లగుంట్ల వెంకట్రాం నర్సయ్య పరమపదించారు. వారి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు మండల పార్టీ అధ్యక్షులు మహాలక్ష్మి వెంకట నరసయ్యలు,వారి అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుగులోత్ లక్ష్మణ్ నాయక్ మాజీ ఎంపిటిసి సుభాన్ బి మౌలానా మాజీ రిటైర్డ్ ఎంఈఓ కొలిశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పు చంద్రయ్య ల్యాదినేని ఎల్లయ్య బిఆర్ఎస్ గ్రామపార్టీ అధ్యక్షులు ఎస్ కే యాకుబ్ పాషా పసునూరి నర్సయ్య సుదగాని మురళి నేలమారి నాగరాజు మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నివాళులర్పించినారు

## గుండె ఆపరేషన్ కోసం రక్తదానం చేసి ఆదుకున్న న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి

- ఓ నెగటివ్ రక్తాన్ని 67 సార్లు దానం చేసిన బేతి మహేందర్ రెడ్డి.
- రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి.
- బీజేపీ నేత, రక్తదాత బేతి మహేందర్ రెడ్డి పిలుపు.




**కరీంనగర్,అక్టోబర్28(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రమాదకర పరిస్థితిల్లో అత్యంత అరుదైన "ఓ నెగటివ్" రక్తాన్ని గత 31 ఏళ్లుగా దానం చేస్తున్నానని, ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడడంతో పాటు నేటివరకు 67 సార్లు రక్తదానంతో పాటు ప్లేట్ లెట్స్, ప్లాస్మా దానం చేయడం జరిగిందని బీజేపీ నేత, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గుర్రం ఆగయ్య (70 ఏళ్లు) అనే వ్యక్తి కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ దవాఖానలో తీవ్రమైన గుండె నొప్పితో భాదపడుతూ చికిత్స నిమిత్తం అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించడంతో పేషెంట్ కు ఓ నెగటివ్ రక్తం అత్యవసరం కాగా నగరంలోని ఒక ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ ద్వారా పేషెంట్ బంధువులు బేతి మహేందర్ రెడ్డి ని ఫోన్ ద్వారా సంప్రదించగా వెంటనే వెళ్లి ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేసి ప్రాణాలు కాపాడడం జరిగిందని మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ రక్తదానం చేయడం ద్వారా నేటివరకు 67 సార్లు ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేయడం జరిగిందని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా రోగి ప్రాణాలు కాపాడడంతో పాటు వారి కుటుంబాన్ని కూడా రక్షించినవారమవుతామని, అలాగే రక్తదానం చేయడం ద్వారా మనకు కొత్త రక్తం రావడమే కాకుండా ఆరోగ్య%శీ%గా ఉంటామని, అందుకే ఎలాంటి భయాలు లేకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఈ సందర్బంగా బేతి మహేందర్ రెడ్డి కోరారు. రక్తదానం చేసిన బేతి మహేందర్ రెడ్డిని బీజేపీ శ్రేణులు, న్యాయవాదులు, 40వ డివిజన్ వాస్తవ్యులు, శ్రేయోభిలాషులు అభినందించారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.

## జాతీయ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు ఖమ్మం క్రీడాకారులు

- జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడం జిల్లాకు గర్వకారణం
- జిల్లా క్రీడల అధికారి సునీల్ కుమార్ రెడ్డి, కోచ్ సాంబమూర్తి




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనడం ఖమ్మం జిల్లాకు గర్వకారణమని జిల్లా క్రీడల అధికారి సునీల్ కుమార్ రెడ్డి, కోచ్ సాంబమూర్తి అన్నారు. ఈ నెల 29వ తారీఖు నుండి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నందు జరగబోయే జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు తెలంగాణ జట్టు తరఫున ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి, ఉత్తమ ఫలితాలు సాధించి, రాష్ట్రానికి, ఖమ్మం జిల్లాకి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్షులు బాలసాని విజయకుమార్, ఉపాధ్యక్షులు, ఇతర ప్రముఖులు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. జిల్లా కార్యదర్శి, కోచ్ సాంబమూర్తి మాట్లాడుతూ... జాతీయ స్థాయి పోటీల్లో ఖమ్మం విద్యార్థులు పాల్గొనడం జిల్లాకు ఎంతో గర్వకారణమని, ఈ పోటీల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శన సాధిస్తారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులు రెడ్డి, సాయి, శివ (మెన్ విభాగం), పరిటాల జ్వలిత్ (న్యూరిడ్జి స్కూల్)(జూనియర్ విభాగం), పిట్టల మోహిత్ (హార్వెస్ట్ జూనియర్ కాలేజీ). ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రీడాధికారులు, ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. జాతీయ స్థాయిలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఖమ్మం జిల్లా క్రీడాలోకం తరపున శుభాకాంక్షలు తెలిపారు.

## పుస్తె మట్టెలు పంపిణి చేసిన కరీంనగర్ ఆర్యవైశ్య నేతలు..



**కరీంనగర్,అక్టోబర్28(పీసీడబ్ల్యూ న్యూస్):** వీణవంక మండలం బొంతు పల్లి గ్రామానికి చెందిన నిరుపేద ఆర్య వైశ్య కుటుంబానికి చెందిన అమ్మాయి నవ్య వివాహం నవంబర్ 1 తేదీన నిశ్చయించడం కావడంతో, ఆ నిరుపేద నిరుపేద వివాహ కుటుంబానికి సహాయం చేయడానికి కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య నేతలు ముందుకు వచ్చారు .కరీంనగర్ పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్ దాతల సహకారం తో కరీంనగర్ లోని వైశ్య భవన్ లో పెళ్లికూతురు కి చీర, పుస్తె మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా. రాజేందర్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఇకముందు కూడా చేస్తామని తెలిపారు,మమ్మల్ని ప్రోత్సాహస్తూ సహాయం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు..ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది వేణు గోపాల్, కోశాధికారి సుద్దాల వెంకటేష్, బొడ్ల శ్రీరాములు, తిరుపతి, అలెంకి సంతోష్ రాజ్, సంతోష్, కిరణ్ కుమార్ తో పాటు అమ్మాయి బంధువులు పాల్గొన్నారు.

## చిలుకోయలపాడులో ఎమ్మెల్యే చొరవతో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

- కృషి చేసిన మండల కాంగ్రెస్ నాయకులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, బుడిగం లక్ష్మీనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు ఊడుగుల వెంకన్న
- ధనలక్ష్మి కొనుగోలు కేంద్రంగా పేరును ఖరారు







**మహబూబాబాద్, అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ చొరవతో సీరోల్ మండలంలోని చిలుకోయలపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కానుంది. గ్రామ రైతులు ఎదుర్కొంటున్న వరి ధాన్యం రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకొని, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, చిలుకోయలపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉడుగుల వెంకన్న లు తీవ్రంగా ప్రయత్నాలు జరిపారు.వారి సూచన మేరకు మండల తాసిల్దార్ పున్నం చందర్ రావు, ఏపీఎం పాపయ్య, సీసీ రమేష్ లతో కలిసి స్థలాన్ని సోమవారం పరిశీలించారు. పరిశీలన అనంతరం ఆ స్థలాన్ని అనుకూలమని అంగీకరించి, "ధనలక్ష్మి కొనుగోలు కేంద్రం" పేరుతో నమోదు చేయాలని నిర్ణయించారు. గ్రామ రైతుల సమక్షంలో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ యొక్క కమిటీలో పూజల లావణ్య, పెద్ది మౌనిక, సూరబోయిన భవాని, ఊడుగుల మౌనిక లను కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.ఈ సందర్భంగా గ్రామ రైతులు ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ ని, మండల కాంగ్రెస్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీఏ ఎస్.కే. నజ్రిన్, మహిళా సంఘాల గ్రామ అధ్యక్షురాలు జోగి పద్మ,కమిటీ సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థినీల హక్కులకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దాసగాని సుమ





**నర్సంపేట, అక్టోబర్ 28(పీసీడబ్ల్యూ న్యూస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వరంగల్ జిల్లా గర్ల్స్ కన్వెంక్షన్ నర్సంపేట పట్టణంలోని భద్రకాళి ఒకేషన్ కళాశాల లో జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేష్ అధ్యక్షాతన జరిగింది.ఏ సమావేశానికి ముఖ్య అతిధి గా ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దాసగాని సుమ పాల్గొని మాట్లాడుతూ మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్ని అన్నారు. మహిళల విద్యార్థినీల పైన అత్యాచారాలు మానభంగాలు పెరిగిపోయాయని అదేవిధంగా ప్రతి నిమిషానికి మహిళల పైన దాడులు జరుగుతూనే ఉన్నాయని వాపోయారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సేఫ్టీ నాప్కిన్స్ అందించాలని ప్రభుత్వాలను కోరారు. ఈ రాష్ట్ర విద్యార్థినీలకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటూనే ఆడపిల్లలను పుట్టనిద్దాం చదవనిద్దాం ఎదగనిద్దాం కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో విద్యార్థినిలకు అందజేస్తామన్న స్కూటీల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.సంక్షేమ హాస్టల్లో విద్యార్థిని లకు నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. జిల్లా కార్యదర్శి యారా ప్రశాంత్ మాట్లాడుతూబిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి విద్యారంగానికి దేశం లో నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమైందని ఉన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి కాషాయకరణను చేయడం సరి కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం భారతదేశాన్ని రెండు దేశాలుగా విభజిస్తుందని అన్నారు ఒకటి షైనింగ్ ఇండియా మరొకటి సఫరింగ్ ఇండియాగా మారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో పేద ధనిక అనే భావనను తీసుకురావడం సరికాదని అన్నారు.అనంతరం నూతన కన్వినింగ్ కమిటీ 9 మంది తో ఎన్నుకున్నారు జిల్లా కన్వీనర్ గా అంగీరక అక్షిత కో-కన్వీనర్ గా ముష్కి వైష్ణవి,రాళ్ల పల్లి వైష్ణవి ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయకులు సిద్దు అక్షయ,శ్రావ్య,అంజలి,సంధ్య,లక్ష్మి ప్రసన్న,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలసిన నూతన ఎంపీడీవోలు

- సేవ భావంతో విధులు నిర్వహించి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 28(పి.సి.డబ్ల్యూ న్యూస్):** గ్రూప్ వన్ ద్వారా జిల్లాకు కేటాయించబడి శిక్షణా పూర్తి చేసుకున్న మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు మహబూబాబాద్ డి.సుస్మిత, చిన్న గూడూరు ఎం. సుజాత, నరసింహులపేట వై .అంజలి, గంగారం డి.వైష్ణవి, బయ్యారం డి.దీపిక లు మంగళవారం రోజున విధులలో చేరిన సందర్భంగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ప్రవేశపెట్టే అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు అభివృద్ధిలో కీలక భూమిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు పోషించాలని అందుకు నిబద్ధత, సేవ భావంతో విధులు నిర్వహించి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలనిఈ సందర్భంగా కలెక్టర్ కొత్తగా చేరిన ఎంపీడీవోలకు సూచించారు,ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య ప్రణాళిక అధికారి పురుషోత్తం, ఉన్నారు.

# ఆపదలో ఉన్న మహిళను పోలీస్ జీప్‌లో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్న పోలీసులు








● బస్సు ప్రయాణంలో ఫిట్స్ వచ్చిన మహిళ

**తొర్రూరు ప్రతినిధి, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** కాకి డ్రెస్ వేసుకున్న పోలీసులంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతారు. పోలీసులు అంటే కఠినంగా వ్యవహరించే వారని అనుకుంటారు కానీ వారు కూడా పై అధికారుల ఆదేశాల మేరకే వారి వృత్తిరీత్యా వ్యవహరిస్తారని అందులో కూడా పోలీసులు ఆపద సమయంలో మానవత్వాన్ని చాటుకుంటారు కొందరు. వివరాలలోనికి వస్తే మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ లో హైదరాబాద్ ఉప్పల్ ఎక్స్ రోడ్ నుండి ఎక్స్ప్రెస్ బస్సులో ప్రయాణిస్తూ వస్తున్న ఒక మహిళ బస్సు మార్గమధ్యంలో తనకి అధికారులు టికెట్లు చెక్ చేస్తున్న సమయంలో కొంత ఒత్తిడికి గురైందని అదే సమయంలో ఫిట్స్ రావడంతో వెంటనే బస్సును తొర్రూర్ బస్టాండ్ తీసుకువచ్చారు. అదే సమయంలో బస్టాండ్ ప్రాంగణంలో విద్యార్థులకు ప్రయాణికులకు గంజాయి లాంటి మత్తుపదార్థాలను సేవించడం వల్ల వచ్చే అనర్థాలు అలాగే బస్టాండ్ లో జరుగుతున్న దొంగతనాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిన పోలీసులు. అదే సమయంలో వచ్చిన బస్సు ప్రయాణికురాలుకు ఫిట్స్ వచ్చిన విషయాన్ని తెలుసుకొని వెంటనే అంబులెన్స్ ఆలస్యం అవుతుందని బస్సులో నుండి క్రిందికి దించి పోలీస్ జీవులో తొరూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తోరూర్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాలు ప్రకారం ఇద్దరు మహిళ కానిస్టేబుల్ సహాయంతో పోలీస్ వాహనంలో తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. సదర్ మహిళ ల నెల్లికుదురు మండలం శ్రీరామ్ గిరికి చెందిన వారిని అన్నారు. ఆమె వద్ద ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియపరచడంతో వెంటనే ఆమె భర్తతోపాటు కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. సమయాన్ని ఎలాంటి వృధా చేయకుండా బస్సులోనే డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులు కూడా అనారోగ్యానికి గురైన మహిళలకు సహాయపడినట్లు ప్రయాణికులు తెలిపారు. ప్రయాణికురాలు వెంట ఎవరూ లేకపోవడంతో ప్రయాణికులే ఆమెకు అన్ని రకాల సహాయం చేశారని అన్నారు. సమయానికి అదే సమయంలో ఉన్న పోలీసు హెడ్ కానిస్టేబుల్ రవీందర్,బాలకృష్ణ మహిళ కానిస్టేబుల్ రతియాన,సంధ్య పోలీస్ జీప్ డ్రైవర్ సుధాకర్, ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ వారు సమయానికి ఆదుకున్నారని ప్రయాణికులు వారిని అభినందించారు.

# తెలంగాణలో భారీ వర్ష సూచన

● నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ

● పంటల పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం రైతుల అప్రమత్తంగా ఉండాలి

● ఒక ప్రకటన ద్వారా వెల్లడించిన మహబూబాబాద్ జిల్లా డిపిఆర్ఓ

**తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** ముంచు కొస్తున్న మొంథా తుఫాన్ అలర్ట్ బంగాళాఖాతంలో బలపడుతున్న తీవ్ర తుఫాను నేడుతుఫానుగా బలపడనున్న తీవ్ర వాయుగుండం గా మారి గంటకు 90 నుండి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలంగాణకు భారీ వర్ష సూచన ఎల్లుండి తెలంగాణలో నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలోని నాలుగు జిల్లాలు ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం,వరంగల్ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన. తెలంగాణలో మొక్కజొన్న, పత్తి, తదితర పంటలకు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు రైతులకు సూచించారు. ఈ విషయాన్ని మహబూబాబాద్ జిల్లా డిపిఆర్ఓ ఒక ప్రకటన ద్వారా సోమవారం వెల్లడించారు.

# ఖమ్మం జిల్లా నుండి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

- టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరామ్



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కార్తీక పౌర్ణమి (నవంబర్ 5) సందర్భంగా ఖమ్మం జిల్లాలోని భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు ను ఏర్పాటు చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ సూపర్ లగ్జరీ బస్సులో మొత్తం 36 పుష్‌బ్యాక్ సీట్లు ఉంటాయన్నారు. ఖమ్మం బస్ స్టేషన్ నుండి బస్సు నవంబర్ 3వ తేదీ సాయంత్రం 7 గంటలకు బయలుదేరి, నవంబర్ 4వ తేదీ ఉదయం కానిపాక వినాయకస్వామి దర్శనం, గోల్డెన్ టెంపుల్ (వెల్లూరు) దర్శనం, అనంతరం అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, శ్రీ అరుణాచలేశ్వర స్వామి దర్శనం కల్పించబడుతుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ ధర పెద్దలకు రూ. 5,000, పిల్లలకు రూ. 2,530లుగా నిర్ణయించారు. పూర్తి వివరాల కోసం 91364 46666, 99592 25979, 99592 25965 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# ఇందిరమ్మ ఇండ్లబిల్లుల చెల్లింపులో కొత్త కొర్రీలు

● బిఆర్ఎస్ మల్లంపల్లి మండల యూత్ ప్రెసిడెంట్ మొర్రిరాజు యాదవ్



**మల్లంపల్లి మండల ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల చెల్లింపులో కొన్నికొత్తగా కొర్రీలు పెట్టడం జరుగుతుందని మొర్రిరాజు యాదవ్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని చెప్పి అందులో అనేక అవక తవకలు జరిగాయి అంటే మళ్లీ లబ్ధిదారుల ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి ఇప్పుడు స్లాబ్ పడి ఇల్లు పూర్తయ్యే సమయంలో మూడో విడతలో రెండులక్షల రూపాయల్లో లో నుండి 60 వేల రూపాయలు ఉపాధి హామీ పథకం కింద ఇస్తామనడం ద్వారా ఈ ప్రభుత్వం లబ్ధిదారులను మోసం చేసినట్టు అవుతుంది. ఇలా చేయడం చాలా దురదృష్టకరం. దీని ద్వారా లబ్ధిదారుల మీద భారంపడి అనేకమంది ఇబ్బందులకు గురి అవుతారని ఇప్పటికే కొంతమందికి డబ్బులు పడక ఇబ్బంది పడుతుంటే అప్పుచేసి మరి ఇల్లు కట్టుకున్న వారి పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు 60 వేల రూపాయలు ఉపాధి హామీ పథకం ద్వారా ఇవ్వాలన్న నిర్ణయాన్నిప్రభుత్వం మరొకసారి పునరాలోచనచేసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 60 వేల రూపాయలు ఇవ్వడం కాకుండా నేరుగాలబ్ధిదారుల ఖాతాలోనే డబ్బులు వేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ చీదర సంతోష్ జిల్లా యూత్ అధికార ప్రతినిధి రేణుకుంట్లసురేష్ జిల్లా యూత్ నాయకులు చోటు మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు

# 30న జరిగే విద్యాసంస్థల బందును విజయవంతం చేయండి

● ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతిబసు.




**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 28(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఈనెల 30వ తేదీన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ బీఈడీ పీజీ మరియు ప్రభుత్వ యూనివర్సిటీల బందును విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతి బస్సు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మరిపెడ మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు విద్యార్థుల స్కాలర్షిప్ మరియు రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 7800 కోట్ల స్కాలర్షిప్లో పెండింగ్లో ఉండడం వల్ల పేద విద్యార్థులకు చదువు అందని ద్రాక్షగా మారిందని విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న తెలంగాణ రాష్ట్రాన్ని కనీసం విద్యాశాఖ మంత్రి లేరని మండిపడ్డారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాకముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మరిపెడ మండల కన్వీనర్ పెద్దపులి బాసు మండల నాయకులు వినయ్ ప్రవీణ్ యాకన్న మహేశ్వరి అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఆకేరు వాగు పరివాహక ప్రాంతం తండా ప్రజలకు అప్రమత్తత సూచనలు చేసిన తాహాసిల్దార్ పున్నం చందర్







**మహబూబాబాద్,, అక్టోబర్ 28(పి సి డబ్ల్యూ న్యూస్):** సిరోలు మండలంలోని మన్నెగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలోని మోదుగడ్డ తండా, దుబ్బగడ్డ తండా, ఆకేరు వాగు పరివాహక ప్రాంతాలను సీరోల్ మండల తాహాసిల్దార్ పున్నం చందర్, అధికారులు సందర్శించారు. గత 2024 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకేరు వాగు ఉప్పొంగి ఈ తండాలు పూర్తిగా మునిగిపోయిన విషయం తెలిసిందే.వర్షాకాలం ప్రారంభం కావడంతో మళ్లీ అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో గ్రామస్థులు, హాబిటేషన్ వాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాల సందర్భంలో పునరావాస కేంద్రాలుగా సమీపంలోని పాఠశాల భవనం, మన్నెగూడెం రైతు వేదికలను గుర్తించారు.ఈ యొక్క పరిశీలనలో, మోదుగడ్డ తండా గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, జిల్లా స్థాయి శిక్షణ పొందిన డిజాస్టర్ మేనేజ్మెంట్ రిస్క్ టీమ్ సభ్యులు, దుబ్బగడ్డ తండా గ్రామస్థులు పాల్గొన్నారు.

# అపర భగీరధుడిగా తుమ్మల చరిత్ర సృష్టి

● ఖమ్మం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

● రూ.200 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

● మున్నేరు-పాలేరు నుంచి నిరంతర నీటి సరఫరా






**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగర ప్రజలు ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీర్ఘకాల కృషికి ఫలితంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. ఖమ్మం నగరానికి రక్షిత తాగునీటి సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ జీవో నెంబర్ 747 జారీ చేసింది.మున్నేరు నది నుంచి ఎనిమిది నెలలు, వేసవికాలంలో పాలేరు జలాశయం నుంచి నీటిని అందించే ప్రణాళిక రూపొందించారు. ఈ విధంగా రెండు వనరుల ఆధారంగా ఖమ్మం నగరానికి నిరాటంకంగా తాగునీటి సరఫరా జరుగనుంది. పాత దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ వ్యవస్థను విస్తరించి ఆధునిక సదుపాయాలతో అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఇప్పటి వరకు లకారం ట్యాంకు మీద ఆధారపడిన ఖమ్మం నగరానికి కొత్త పైపులైన్‌లు, పంప్‌హౌస్‌లు, ఫిల్టర్‌బెడ్‌ల నిర్మాణం ద్వారా ఆధునిక నీటి సరఫరా వ్యవస్థ సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టు ఖమ్మం నగర అభివృద్ధికి పునాది వేయడంతో పాటు పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించనుంది.ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసిన తుమ్మల నాగేశ్వరరావు చొరవను నగర ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఆయన తపన, సంకల్పం ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం 200 కోట్లు కేటాయించిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీకీ గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి

- జెడి మల్లంపల్లి బిజెపి మండల నాయకులు బైకాని మహేందర్ యాదవ్



**మల్లంపల్లి మండల ప్రతినిధి అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీలను కేవలం ఓట్ బ్యాంకుగా చూస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వంజిల్లా, మండల మరియు గ్రామ పార్టీ అధ్యక్ష పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి అని మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు, అగ్రవర్ణాలకే సముచిత స్థానం కల్పిస్తూ, బీసీలను అణచివేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి అగ్రవర్ణాలకే నామినేటెడ్ పదవులు పెద్ద సంఖ్యలో ఇచ్చిన సందర్భం బీసీలు గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో అగ్రవర్ణ పాలన నడుస్తుంది. బలహీన వర్గాలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడం లేదని అన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్న ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవులలోనైనా, బీసీలకు సముచిత స్థానం కల్పించకపోతే,స్థానిక ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్న రాజకీయ పార్టీల నాయకులకు, బీసీలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోని ఉన్నాయి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాలలో ఏ ఎమ్మెల్యే గేలవాలన్నాబీసీల ఓట్లే అతి కీలకం అన్న విషయం కాంగ్రెస్ పార్టీ గుర్తుంచుకోవాలని మహేందర్ యాదవ్ స్పష్టం చేశారు.

PCW తెలుగు దినపత్రిక

బుధవారం 29 అక్టోబర్ 2025

# 30న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

**పేద విద్యార్థుల జీవితాలతో చేలగాటమాడుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి**

**పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలి**

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఖమ్మం నగర ముఖ్యకార్యకర్తల సమావేశం ఖమ్మం నగర కేంద్రంలోని సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు దొంగ హామీలు ఇచ్చి గద్దనెక్కారని అన్నారు. గత రెండు సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో 8,150 కోట్ల దాకా స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో చదివే పేద విద్యార్థులకు సర్టిఫికెట్స్ తీసుకుందామంటే ప్రభుత్వం నుండి డబ్బులు రాలేదని, విద్యా సంస్థల యజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. గత నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేటు, డిగ్రీ కళాశాలలు, పిజి కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు రాష్ట్రంలో బంద్ కు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి 1200 కోట్ల రూ.లను రెండు దఫాలుగా విడుదల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మోసం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా రంగ సమస్యలపై, అలాగే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పీజీ కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రొఫెషనల్ కళాశాలలు, యూనివర్సిటీల బంద్ కు పిలుపునివ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ బంద్ లో విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు వంకాయల రాజు, త్రినాధ్, లోకేష్, మనోజ్, రమణ, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కమిషన్ల కోసం పనిచేసే మంత్రులను భర్తరఫ్ చేయాలి

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని గెలిచివస్తే మంత్రి పదవి ఇస్తానని మోసం చేశారు
- 3 నెలల్లో ప్రభుత్వం కూలిపోవడం ఖాయం
- ఆర్.ఎల్.డి పార్టీ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు
- యువత రాజకీయాల్లోకి రావాలి తెలంగాణను ఏలుకోవాలి
- తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్
- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర ఖమ్మం చేరుకుంది




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో కమిషన్ల కోసమే పనిచేసే మంత్రులను బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర సోమవారం ఖమ్మం చేరుకుంది. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం కోసం పనిచేయని వారు నేడు మంత్రులుగా కమీషన్ల కోసమే పని చేస్తున్నారని వారిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికై 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు 95శాతం ఉద్యోగాలు కల్పించేలా చట్టం చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలన్నారు. రాజీవ్ యువవికాసం పేరిట 5 లక్షల మంది నిరుద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. అంబేద్కర్ అభయహస్తం పేరిట దళితులకు 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు తులం బంగారం, గృహలక్ష్మీ పథకం క్రింద రూ. 2500లు చెల్లించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ లో గెలిచి వస్తే మంత్రి పదవి ఇస్తానని మోసం చేశారని, మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర ఖమ్మం చేరుకుందని, మిగతా జిల్లాల్లో కూడా ఈ యాత్ర కొనసాగుతుందని తెలియజేశారు. పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు జాబ్ మేళ నిర్వహిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధికార ప్రతినిధి గౌర బీరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోత్కూరి వెంకటాచారి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గంట్యాల నరసింహారావు, కార్యదర్శి నూనె భాస్కరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్.కె జానీ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్లో విజయదుందుభి అభినందనీయం

- జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డి
- ఖమ్మం టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల పథకాల జోరు
- కోచ్ సాంబమూర్తి కష్టానికి ఫలితం
- సాంబమూర్తి పట్టుదలే టేబుల్ టెన్నిస్‌లో జాతీయస్థాయి పథకాలు
- టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్






**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మేడ్చల్ డి.ఆర్.యస్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈ నెల 24,25 తేదీలలో జరిగిన టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలలో వివిధ విభాగాల్లో పాల్గొన్న ఖమ్మం క్రీడాకారులు విజయ దుందుభి మ్రోగించారు. 15 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పథకాలతో పాటు దాదాపుగా 20 పథకాలు సాధించారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు రాణించి మెడల్స్ ను సాధించిన ఘనత ఖమ్మం జిల్లాకు దక్కినందుకు క్రీడల అధికారి సునీల్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్ మాట్లాడుతూ... కోచ్ సాంబమూర్తి పట్టుదలే నేడు టేబుల్ టెన్నిస్ లో జాతీయస్థాయి పథకాలు సాధించగలిగామన్నారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు వారి వారి ప్రతిభను బట్టి చక్కని అవకాశాలు కల్పిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించి, క్రీడ నైపుణ్యాలను మెరుగుపరుస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా శిక్షణ ఇస్తున్న సాంబమూర్తిని ఆయన అభినందించారు. కష్టనష్టాలను అధిగమించి క్రీడాకారుల్లో మనోధైర్యాన్ని నింపుతూ వారిని ప్రోత్సహిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రతి క్రీడాకారుణ్ణి బరిలోకి దించి పోటీలో బంతి బంతికి మెలకువలు తెలుపుతూ విజయానికి బాటలు వేసిన కోచ్ సాంబమూర్తికి జిల్లా పేరెంట్స్ కమిటీ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. విజేతల వివరాలు బాలురు : పి.జ్వాలిత్, పి మోహిత్, రణధీర్ రెడ్డి, చార్విక్, ఫజల్, తరుణ్, హరి, జాయ్, బాలికలు : జి.సిరి, శివాని, చంద్రిక, షర్మిల, సౌమ్య పథకాలు సాధించారు.

# ఈతకు మించిన వ్యాయామం లేదు

**ప్రతిరోజు ఈతతో శారీరక-మానసిక-ఆరోగ్య ప్రశాంతత**

**మున్నేరు ఈత మిత్రుల అసోసియేషన్ బాధ్యులు కోదాటి గిరి**

**ఉల్లాసంగా, ఉత్సాహంగా మున్నేరు ఈత మిత్రుల ర్యాలీ**

**ప్రతి ఏడాది వేసవిలో గురుదక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఈత నేర్పడం**








**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఈతకు మించిన వ్యాయామం లేదని, ఆత్మరక్షణకు, సకల రోగాలకు ఈత ఒక మార్గదర్శకమని మున్నేరు ఈత మిత్రుల అసోసియేషన్ బాధ్యులు కోదాటి గిరి అన్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు పోలేపల్లి మున్నేరు ఒడ్డున ప్రారంభమైన మున్నేరు ఈత మిత్రుల లాంగ్ ర్యాలీ 6 కిలోమీటర్లు కొనసాగుతూ ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా ముందుకు సాగి కరుణగిరి సమీపాన ఉన్న గురుదక్షిణ ఫౌండేషన్ మున్నేరు ఒడ్డుకు చేరుకుంది. మొత్తం 150 మంది పాల్గొన్న ఈ ఈత ర్యాలీని మున్నేరు సీనియర్ స్విమ్మర్స్ బోజెడ్ల ప్రభాకర్, ఆర్గానిక్ రాంరెడ్డి, రిటైర్డ్ తహశీల్దార్ దర్గయ్య, ఎక్సైడ్ బుజ్జి, కోటేశ్వరరావు, గోపాలరావు జెండా ఊపి ప్రారంభించినట్లు మున్నేరు ఈత మిత్రుల అసోసియేషన్ బాధ్యులు కోదాటి గిరి తెలిపారు. ఈ సంధర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కోదాటి గిరి మాట్లాడుతూ... నీటి ప్రమాదాల నుండి ప్రజలకు అవగాహన, రక్షణ కల్పించేందుకై ఈరోజు ఆదివారం మున్నేరులో లాంగ్ ఈత ర్యాలీ నిర్వహించినట్లు, ఈ ర్యాలీలో వయస్సు కూడా లెక్కచేయకుండా ఎనభై ఏళ్ళు దాటిన స్విమ్మర్లు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేసినట్లు తెలిపారు. ప్రతి ఏడాది వేసవిలో గురుదక్షిణ ఫౌండేషన్ మున్నేరు ఒడ్డున బాల, బాలికలకు, మహిళలు, పురుషులకు ఉచితంగా తమ మున్నేరు ఈత మిత్రుల అసోసియేషన్ స్విమ్మర్లు ఈత నేర్పిస్తూ, నీటి ప్రమాదాలకు గురికాకుండా ప్రజల్నీ చైతన్యవంతం చేస్తుందని పేర్కొన్నారు. ఈతకు మించిన వ్యాయామంలేదని వైద్యులు సైతం చెపుతారని ప్రతిరోజూ ఈత కొట్టడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం, ప్రశాంతత లభిస్తాయని స్పష్టం చేసారు. మున్నేరుకు నూతనంగా కరకట్ట నిర్మిస్తున్న నేపథ్యంలో గురుదక్షిణ ఫౌండేషన్ మున్నేరు ఒడ్డున కరకట్టకు రెండు వైపులా మెట్లు నిర్మించి రోజూ ఈత కొట్టే వారికి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు స్విమ్మర్లు బోడేపూడి నాగేశ్వరరావు, తూము శ్రీనివాస్ రావు, గాదే లక్ష్మినారాయణ, ఆర్డబ్ల్యూఎస్ రాంరెడ్డి, పాశం అప్పారావు, టేకుమట్ల హుస్సేన్, మందపల్లి లక్ష్మణ్, సుధాకర్, జానీ, కళ్యాణం కృష్ణయ్య, చింతనిప్పు రవి, సురేందర్, ఏఎన్నార్, విశ్వనాథం, రాయల మల్లి, రిటైర్డ్ డిపిఆర్ఓ రమేష్, వెంకన్న, రామారావు, డాక్టర్ రామకృష్ణ, మాధవరావు, సామినేని రవి, అమర్, రంజిత్, కొండల్ రావు, రెడ్డి, ఖానాపురం బృందం తరుపున దొండపాటి శ్రీనివాస్ రావు, తమ్మినేని వెంకటేశ్వరరావు, రవి, వీరన్న, సుందర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



# తీగల గుట్టపల్లిలో ఘనంగా ఛత్ పూజ పండగ...





**కరీంనగర్,అక్టోబర్28(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లి 2వ డివిజన్‌లో ఉత్తరప్రదేశ్ సోదర సోదరీ మణులు ఛత్ పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తీగలగుట్టపల్లి ఫోటో డివిజన్లోని బతుకమ్మ కుంట వద్ద ఈ పూజ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీజేపీ తాజా మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ పాల్గొని , అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎంఐఎంను గెలిపిస్తే తెలంగాణ మాదిరిగా బిహార్‌లోనూ మైనారిటీ సంక్షేమం అమలు

**- బిహార్ ఎన్నికల ప్రచారంలో ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్**









**కరీంనగర్ అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** ముస్లిం, మైనారిటీ వర్గాల సంక్షేమంలో తెలంగాణ మాదిరిగా బిహార్ ను అగ్రభాగాన నిలిపేందుకు బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ప్రత్యేక చొరవ తీసుకుంటారని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ బిహార్ లోని సీమాంచల్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు బిహార్ లోని కిషన్ గంజ్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి శమ్స్ అగాజ్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కిషన్ గంజ్ పరిధిలోని మొతిహార పంచాయితీ తాలూకా, హలమాల పంచాయితీ, బైర్ బన్నా పంచాయితీల పరిధిలో జిహెచ్ఎంసి కార్పొరేటర్లు ఫర్హాన్, డాక్టర్ ఖాసీంలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంఐఎం ఎమ్మెల్యేలను గెలిపిస్తే తెలంగాణలో అమలవుతున్న మైనార్టీ సంక్షేమ పథకాలను బీహార్లోనూ ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తారని చెప్పారు. సీమాంచల్ ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం వందలాది కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం, విద్యార్థుల కోసం గురుకులాల ఏర్పాటు, విదేశీ విద్య కోసం నిధి ఏర్పాటు, పేద మైనార్టీ యువతుల వివాహం కోసం షాది ముబారక్ పథకాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు.

# దేశానికి ఆదర్శం తెలంగాణ విద్య

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు**

**మధిర క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖపై సమీక్షించిన డిప్యూటీ సీఎం**







**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశానికి ఆదర్శవంతంగా తెలంగాణ విద్యా వ్యవస్థ అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డిప్యూటీ సిఎం. మంగళవారం మధిర నియోజకవర్గంలో తన క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖపై విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్మీడియట్ విద్యా శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పాఠశాల విద్య సంచాలకులు నవీన్ నికోలస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ... జిల్లాలో విద్య పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మధిర ప్రాంతంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు పర్యటించారని తెలిపారు. దేశంలోనే ఆదర్శవంతంగా విద్యాశాఖను అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తుందని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు, ఐటీఐ లను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా, పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసామని అన్నారు. రాష్ట్రంలో అనేక కోర్సులను ప్రస్తుత పరిశ్రమల అవసరాల మేరకు డిజైన్ చేసి విద్యార్థులకు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో డిగ్రీ కళాశాల లేదా జూనియర్ కళాశాలలో ఒక అంబేద్కర్ నాలెడ్జి సెంటర్ ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేసి ప్రతిపాదనలను వెంటనే తయారు చేయాలని అధికారులకు సూచించారు. దేశంలో జరిగే అన్ని రకాల పోటీ పరీక్షలకు ఇక్కడి నుంచే విద్యార్థులు సన్నద్ధమయ్యేందుకు వీలుగా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. హైదరాబాద్ నుంచి నిపుణులు చెప్పే పాఠాలు ఇక్కడ విద్యార్థులు వినే లాగా డిజిటల్ లైబ్రరీలను అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ లలో ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాలయాలపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం తెలిపారు. 200 కోట్ల ఖర్చు చేస్తూ 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనేలా విద్యార్థులను తయారు చేసేందుకు 'యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు' గేమ్ చేంజర్ గా నిలుస్తాయని అన్నారు. మధిర నియోజకవర్గ పరిధిలో రాబోయే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. మధిర ప్రాంతంలో ప్రతి మండలంలో 3 క్లస్టర్ పాఠశాలలను గుర్తించి అక్కడ 10 గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు అవసరమైన మేర తరగతి గదులు, ఇతర ఇన్ ఫ్రా, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఏర్పాటు చేస్తూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. మధిర నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్ పాఠశాలలను గుర్తించామని, అక్కడ అభివృద్ధి పనులు చేపట్టి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తామని అన్నారు. జిల్లాలో ఉన్న కేజీబీవిలో కూడా అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ... మధిర నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక చేపట్టామన్నారు. అన్ని విద్యా సంస్థల్లో ఇన్ఫ్రాస్ట్రక్చర్ తో పాటు అన్ని విధాలా సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాకు ఫుల్ టైం డిఈఓ, ఏడి స్థాయి అధికారినీ కేటాయించాలని అన్నారు. ఎఫ్.ఆర్.ఎస్. అమలులో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని, ప్రతి రోజు విద్యార్థుల, ఉపాధ్యా యుల హాజరు, ఎఫ్.ఆర్.ఎస్ పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో చదివే ప్రతి విద్యార్థికి ఆధార్, అపార, కుల ధృవీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్ ఉండేలా చర్యలు చేపట్టామని, మండల స్థాయిలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసి నెల రోజుల వ్యవధిలో సాచురేషన్ పద్ధతిలో వంద శాతం ప్రతి విద్యార్థికి 4 సర్టిఫికెట్లు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యాశాఖ సిఇ గణపతి రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**ములుగు జిల్లా, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏటూరునాగారం మండలం, గోగుపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ కృష్ణ గారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మంత్రివర్యులు ధనసరి సీతక్క గారి ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు చిటమట రఘు గార్ల సూచనలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు దశదినకర్మ కార్యక్రమం కోసం 50 కిలోల బియ్యం అందజేసి, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ , ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చేల వినయ్, PACS డైరెక్టర్ వంగపల్లి రవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏర్మారెడ్డి రాజశేఖ రరెడ్డి, రాకేష్ రెడ్డి, బుచ్చయ్య, బిక్షపతి, రాజు, సుధాకర్, సత్యం, యాదయ్య, యాదగిరి, రాంబాబు, కోటేశ్వరరావు, దేవర్, మహేష్, పవన్, రాజేష్, కాంతారావు, లక్ష్మణ్ నాయకులు పాల్గొన్నారు.

# వీరపూర్ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**ములుగు జిల్లా, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారి సూచనలతో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు గారు మరియు మండల కాంగ్రెస్ నాయకులు వీరపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఈరోజు పరిశీలించారు.సమావేశంలో నేతలు మాట్లాడుతూ, మంత్రి సీతక్క గారి నేతృత్వంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే ఆహారం పౌష్టికంగా మరియు రుచికరంగా ఉందని ప్రశంసించారు. మెనూ ప్రకారం పిల్లలకు పాలు, గుడ్లు, స్నాక్స్, బియ్యం, పప్పులు సమృద్ధిగా అందజేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఆట వస్తువులు మరియు అవసరమైన అన్ని సదుపాయాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్నె సత్యం, మాజీ సర్పంచ్ చింత సుమలత%-%రమేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుదురుపాక శ్రీనివాస్, సోదారి హరీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పడిదాల సారయ్య, రాంబాబు, విశ్వనాథం, పడిదాల లక్ష్మీనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ ఓపెన్ హౌస్ ప్రారంభించిన పోలీస్ కమిషనర్





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాలు నియంత్రణలో ఉన్నాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ అమరవీరులసంస్మరణ దినోత్సవాలను (ఫ్లాగ్ డే) పురస్కారించుకొని సిటీ ఆర్మడ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆన్లైన్ "ఓపెన్ హౌస్" కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారభించారు. పోలీసులు వినియోగించే ఫింగర్ ప్రింట్ యూనిట్, బాంబ్ డిస్పోజల్, పోలీస్ జగిలాలు శ్రమించే తీరు, పనివిధానం, సైబర్ నేరాలను పసిగట్టే విధానాలు, బ్రీత్ ఎనలైజర్స్ తదితరాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. చోరీలు, హత్యలు మాదకద్రవ్యాలను జాగిలాలు నేరగాళ్లను గుర్తించే విధానం, బాంబులు కనిపెట్టే తీరు తదితరాల ప్రదర్శన విద్యార్థులను ఆశ్చర్యచకితులను చేసింది. డాగ్ స్క్వాడ్ విన్యాసాలు అలరించాయి. నేరస్తులను, బాంబులను గుర్తించటం, క్రమశిక్షణతో డాగ్ హ్యాండిలర్స్ ఆదేశాలు పాటించే తీరు విద్యార్థులను ఆకర్షించాయి. పోలీస్ అధికారులు విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల సంస్మరణ దినం ఔన్నత్యాన్ని వివరించారు. పోలీస్ శాఖ వినియోగించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్లూస్ టీం, కమ్యూనికేషన్స్, డాగ్ స్క్వాడ్ విన్యాసాలు, పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, ఆర్ఐ కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, క్లూస్ టీమ్ ఇన్స్పెక్టర్ నరేష్, ఐటి కోర్ టీమ్ హేమనాథ్ పాల్గొన్నారు.

# వీరపూర్లో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు



**ములుగు జిల్లా, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఏటూరునాగారం ఆరాధ్య ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో వీరపూర్ గ్రామంలో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు గారు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, "ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న ఆరాధ్య హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నాం," అన్నారు. ఆసుపత్రి వైద్యులు డా. కళ్యాణి, డా. గౌతమి, డా. వేణు, డా. నాగరాజు లు శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. "మీ ఆరోగ్యం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం" అని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్నె సత్యం, మాజీ సర్పంచ్ చింత సుమలతరమేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుదురుపాక శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పడిదాల సారయ్య, రాంబాబు, విశ్వనాథం, పడిదాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ల వైఫల్యాలకు సమాధానం

**బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవ రావు**

**జూబ్లీహిల్స్లో మార్పు సమయం వచ్చింది - బిజెపి అభ్యర్థి లెంకల దీపక్ రెడ్డినే గెలిపించండి**





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలలో భాగంగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మద్దతుగా మంగళవారం విస్తృత స్థాయిలో ప్రచారం కొనసాగింది. ఈ నేపథ్యంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు శ్రీనగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రజలతో మమేకమై ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో దేవకీ వాసుదేవరావు మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చారు. కానీ ప్రజల సమస్యలు అలాగే ఉన్నాయి. నియోజకవర్గం ఉన్న ప్రాంత్రాలు అభివృద్ధి ఆగిపోయింది, అవినీతి పెరిగిపోయింది. ఇప్పుడు ప్రజలకు ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం బిజెపి పార్టీ మాత్రమేనన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా సాగిపోతోంది. ఆ అభివృద్ధి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రాంత్రాల ప్రజలకు చెందాలంటే జూబ్లీహిల్స్ నుండి బిజెపి పార్టీ అభ్యర్థి లెంకల దీపక్ రెడ్డి గెలిపించాలని ఓటర్ ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసమే హామీలు ప్రకటించారని, ప్రజలను మభ్యపెడుతూ, మోసం చేస్తున్నారన్నారు. ప్రకటించిన హామీలు అమలు చేయడంలో ఎప్పుడూ విఫలం అవుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలు తెలంగాణను అప్పుల్లో ముంచి, అభివృద్ధి పేరుతో కేవలం కుటుంబ పాలన కొనసాగించారన్నారు. ఇప్పటికైనా అలోచించి రెండు పార్టీల చేసిన మోసలను గుర్తు చేసుకొని నిజమైన ప్రజాసేవా పార్టీ అయిన బిజెపి అని ప్రజలు మార్పు, అభివృద్ధి కోసం బీజేపీ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలి అని ప్రజలకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్, ముద్రా యోజన వంటి పథకాల ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబా లకు మేలు జరుగుతోందని వివరించారు. బిజెపి అభ్యర్థి గెలిస్తే, కేంద్ర పథకాలు మరింత విస్తృతంగా ప్రజలందరికీ చేరేలా కృషి చేస్తాం అని హామీ ఇచ్చారు. శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో జరిగిన ఈ ఇంటింటి ప్రచారంలో ప్రజలు ఉత్సాహంగా స్పంది ంచారు. మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్య లో బిజెపి నేతలను ఆత్మీయంగా ఆహ్వానించారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాలాధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహణ



ములుగు జిల్లా ఎటూరునాగారం మండలంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈరోజు మల్లూరు భక్తులు మాలాధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీ ఆనంద్ శర్మ గారి చేతుల మీదుగా భక్తులు మాలలు ధరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ం పూజా సామగ్రి, బట్టలు, నీటి వసతి ం సమకూర్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు ఎటూరునాగారం దేవాలయానికి వచ్చి మాలాధారణ చేసుకోవాలని, ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని గురు స్వాములు భక్తులను కోరారు. అయ్యప్ప భక్తి పూర్వకంగా కార్యక్రమం సాగగా, భక్తులు "ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప" నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు.

# స్వగ్రామం చేగొమ్మలో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన

- గ్రామస్తుల యోగ క్షేమాలు తెలుసుకుని.. పాఠశాల భవనం పరిశీలన
- సాదర స్వాగతం పలికిన.. సొంతూరు ప్రజలు
- అండగా ఉంటానని అభయమిచ్చిన రామసహాయం



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తన స్వగ్రామమైన చేగొమ్మకు వెళ్లి.. గ్రామ పెద్దలు, వృద్ధులను పలకరించి.. ఊరి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి నేనున్నానంటూ భరోసా నింపారు. సొంతూరి పర్యటనకు వచ్చిన ఎంపీకి గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. " పెద్దాయన ఎలా ఉన్నావ్..? ఆరోగ్యం బాగుంటుందా..?" అంటూ పెద్దలతో మాట్లాడి, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. తొలుత కాంగ్రెస్ నాయకులు బొలికొండ శ్రీను తండ్రి బొలికొండ వెంకన్న ఇటీవల చనిపోగా.. వారి నివాసానికి వెళ్లి వెంకన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. **ప్రభుత్వ పాఠశాలకు ఇచ్చిన తమ భవనం పరిశీలన** చేగొమ్మ గ్రామంలో.. దశాబ్దాల కిందట ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్వగృహాన్ని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పరిశీలించారు. తరగతి గదులను, నిరుపయోగంగా ఉన్న పై అంతస్తును పరిశీలించి.. అవసరమైన మరమ్మతులు చేయిస్తానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిషన్ రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, నాయకులు కొండపర్తి సురేష్, గ్రామపెద్దలు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శీనన్న జన్మదినోత్సవ వేడుకల సందడి

- పాల్గొన్న ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయం మంగళవారం ఉదయం పండుగ వాతావరణాన్ని తలపించింది. మంత్రి శీనన్న పుట్టినరోజు సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరం నిర్వహించగా కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హాజరై కేక్ కటింగ్ చేసి రక్తదాన శిబిరానికి శుభారంభం చేశారు. శీనన్న సేవా తత్వం, ప్రజల పట్ల అంకితభావం స్ఫూర్తిగా సుమారు 100 మందికి పైగా యువత, కార్యకర్తలు రక్తదానం చేయగా రక్తదాతలకు ఎంపీ రఘురాంరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు.

# సమావేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంద కృష్ణ మాదిగ...







**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని శ్వేతా హోటల్ లో సోమవారం మీడియా సమావేశ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సిజెఐ గవాయ్ పై జరిగిన దాడికి సంబంధించిన ఈ కార్యక్రమానికి ఎం.ఆర్.పి.ఎస్ బృందం చావరియా కరణ్ సింగ్ ను ఆహ్వానించడం జరింగింది, సమావేశ కార్యక్రమంలో కరణ్ సింగ్ అభిప్రాయాన్ని ప్రివ్యూ చేసుకునే అవకాశం కూడా ఇవ్వబడింది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు - మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

# శీనన్నా నీవు నూరేళ్లు జీవించు...!

**ఊరువాడ పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకలు**

**బైక్ ర్యాలీలతో హోరెత్తిన ఉమ్మడి ఖమ్మంజిల్లా**

**రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాల నిర్వహణ**

**వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఖమ్మం ఎంపీ ఆర్ఆర్ఆర్**









**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** శీనన్నా నీవు నూరేళ్లు జీవించు...! నీకూ జన్మదిన శుభాకాంక్షలే అంటూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఊరువాడ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శీనన్న జన్మదిన వేడుకలను మంగళవారం అట్టహాసంగా, ఘనంగా నిర్వహించారు. పొంగులేటి అభిమానులు భారీ బైక్ ర్యాలీలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను హోరెత్తించారు. పురవీధులన్నీ శీనన్న కటౌట్లు, ఫ్లెక్సీలు, భారీ హోర్డింగ్ లతో నిండిపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి పల్లెలో శీనన్న జన్మదిన వేడుకల కోలాహలమే కనిపించింది. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొంగులేటి శీనన్న పిలుపు మేరకు ఆయన అభిమానులు, కాంగ్రెస్ నేతలంతా సామాజిక కార్యక్రమాల్లోనే నిమగ్నమయ్యారు. **ఖమ్మం, కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో....** మంత్రి పొంగులేటి ఖమ్మం, కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో పుట్టినరోజు సంబురాలు అంబరాన్నంటాయి. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి హాజరై కేక్ కటింగ్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. **ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా...** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శీనన్న పుట్టిన రోజు సంబురాలను కోలాహలంగా నిర్వహించారు. వరంగల్ క్రాస్ రోడ్డులో వెంపటి రవి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. మెఫీ మానసిక వికలాంగుల కేంద్రంలో భూక్య సురేష్ నాయక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. నేలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలో బెల్లం శ్రీను ఆధ్వర్యంలో శీనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముదిగొండ మెయిన్ సెంటర్ లో దేవరపల్లి అనంత రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఎం.వి. పాలెంలో మందపల్లి నాగమణి ఆధ్వర్యంలో శీనన్న జన్మదిన వేడుకలను నిర్వహించారు. గ్రెయిన్ మార్కెట్ ఏరియాలో భీమనాథుల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో, ఖమ్మం ఖానాపురంలో ని శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వాములకు డీసీసీ నాయకులు గుర్రాల శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాల్వఒడ్డులో అన్న క్యాంటీన్ లో మద్ది కిశోర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్ ఆధ్వర్యంలో రామన్నపేటలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఖమ్మం నగరంలో పారా ఉదయ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, బాణాసంచాలను కాల్చారు. మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు ఆధ్వర్యంలో వెంకటగిరిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల కేంద్రంలో ఉడుముల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, బైక్ ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. సింగరేణి మండలంలో జరిగిన శీనన్న జన్మదిన వేడుకల్లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనేక ప్రాంతాల్లో శీనన్న జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# సబ్ స్టేషన్‌ల నిర్మాణంతో నిరంతర విద్యుత్

**రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**ఓల్టేజ్ నియంత్రణ, పవర్ ఫ్యాక్టర్ మెరుగు పరిచే విధంగా చర్యలు**

**మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం, మధిర, బోనకల్ మండలాల్లో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా అవసరమైన చోట సబ్ స్టేషన్ ల నిర్మాణం చేస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డిప్యూటీ సి.ఎం. మంగళవారం మధిర నియోజకవర్గంలో పర్యటించి రూ. 2.97 కోట్లతో ఎర్రుపాలెం మండలం రేమిడిచెర్ల వద్ద, రూ. 2.97 కోట్లతో మధిర మండలం మడుపల్లి, రూ. 2.5 కోట్లతో బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి, రూ. 2.97 కోట్లతో చిరునోముల, రూ. 3.09 కోట్లతో లక్ష్మీపురంల వద్ద చేపట్టిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ఆధారంగా విద్యుత్ రవాణా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా నూతన సబ్ స్టేషన్ ల నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. నూతన సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల ఓల్టేజ్ నియంత్రణ సాధ్యమవుతుందని, మెరుగైన పవర్ ఫ్యాక్టర్ సాధిస్తామని అన్నారు. విద్యుత్ సిబ్బందికి కోటీ రూపాయల ప్రమాద బీమా కల్పించామని అన్నారు. 1912 విద్యుత్ అంబులెన్స్ ద్వారా విద్యుత్ సరఫరా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఇఇ తానేశ్వర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెన్నా నది పరివాహ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- చెన్నూరు మండల తాసిల్దార్ తహశీల్దార్ సరస్వతి



**చెన్నూరు అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):-** మొంథా సూపర్ సైక్లోన్ తుపాను తీవ్ర తుపాను గా మారిన కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఈదురు గాలులతో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో పెన్నా నది పరివాహ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదే విధంగా వాగులు ,వంకలు,చెరువులు ఉన్న గ్రామాల ప్రజలు ఎవరు కూడా అక్కడకు వెళ్లరాదని తహసీల్దార్ సరస్వతి,సీఐ కృష్ణారెడ్డిలు తెలిపారు.పెన్నా పరివాహ ప్రతాలలోని లోతట్టు ప్రాంతాలైన శివాలపల్లె,గుర్రంపాడు,కొండపేటలను వారు మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పశ్చిమ బంగాళాఖాతంలో మొంథా తుఫాను తీవ్ర రూపం దాల్చడం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ నుండి అతి భారీగా వర్షాలు కురుస్తున్నాయని దీంతో చెరువులు,వాగులు,వంకలు పొంగిపొర్లడం జరుగుతున్నదని వాగులు,వంకలు,చెరువులు ఉన్న గ్రామాల ప్రజలు అలాగే పెన్నా తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అత్యవసరమైన పనులు ఉంటే తప్ప ప్రజలు బయటికి రాకూడదని ఆమె చెన్నూరు మండల ప్రజలకు సూచించడం జరిగింది. ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని లేదా సంబంధిత కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలనివారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు,ఆర్ ఐ,పోలీస్ సిబ్బంది రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు